RNI: APTEL/26/A8235

# అక్షర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

నెల్లూరు | సంపుటి - 1 | సంచిక -28 | బుధవారం 28 అక్టోబర్ 2026 | ఎడిటర్: కడియాల చిన్మయరెడ్డి | పేజీలు : 4 | వెల : 2/-


### జనంలో మమేకమవుతూ పొంగూరు షరణి ప్రచారం



03


అక్షర దర్శిని

దినపత్రికలో పని చేయడానికి
అనుభవం కలిగిన, జర్నలిజంపై
ఆసక్తి ఉన్న రిపోర్టర్లు కావలెను.
కొత్త వారికి కూడా అవకాశం ఇవ్వబడును.
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు

9912808090
8374168090




## జెడ్పీ కార్యాలయంపై టీడీపీ జెండా
# రెపరెపలు ఖాయం

- అన్ని జెడ్పీటీసీ స్థానాల్లోనూ భారీ విజయాలు సాధిస్తాం
- అభ్యర్థులకు బీ-ఫారాలు అందజేసిన ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

**నెల్లూరు,(అక్షర దర్శిని) :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని జెడ్పీటీసీ స్థానాల్లోనూ తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు భారీ విజయాలు సాధించబోతున్నారని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో జెడ్పీటీసీ అభ్యర్థులకు పార్టీ బీ-ఫారాలు అందజేసిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర పరిశీలకుడు గుండి రాకేష్‌లతో కలిసి సోమిరెడ్డి అభ్యర్థులకు బీ-ఫారాలు అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ అభ్యర్థులందరినీ నాయకులు అభినందించారు. ప్రతి అభ్యర్థి ప్రజల్లోకి వెళ్లి పార్టీ విధానాలను వివరించాలని, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఎన్నికల్లో సమష్టిగా కృషి చేసి భారీ మెజార్టీలతో విజయం సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా పరిషత్‌పై తెలుగుదేశం పార్టీ జెండా ఎగరడం ఖాయమని సోమిరెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తూ అన్ని జెడ్పీటీసీ స్థానాల్లో విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.





## వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను
# భారీ మెజార్టీతో గెలిపించండి

### 59వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

**నెల్లూరు,(అక్షర దర్శిని):** నెల్లూరు నగరాభివృద్ధి కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు డాక్టర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నెల్లూరు నగరంలోని 59వ డివిజన్‌లో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ అభ్యర్థి కిషన్, మేయర్ అభ్యర్థి ఆనం విజయ్‌కుమార్‌రెడ్డికి మద్దతుగా మంగళవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. శాసనమండలి సభ్యుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసులు, ఇతర పార్టీ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. అంతకుముందు శ్రీరామ మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు.

**కూటమి పాలనపై విమర్శలు** ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో దాడులు, దౌర్జన్యాలు పెరిగాయని, నిత్యావసర వస్తువుల ధరలు సామాన్య ప్రజలకు భారంగా మారాయని విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ధరలు, ప్రస్తుతం ఉన్న ధరలను ప్రజలు బేరీజు వేసుకోవాలని సూచించారు.మున్సిపల్ శాఖ మంత్రి నారాయణపై విమర్శలు గుప్పిస్తూ పన్నుల

మిగతా 2 లో.......



## దుగ్గుంటలో కాకాణికి అడుగడుగునా జన నీరాజనం

- టీడీపీకి షాక్.. వైఎస్సార్‌సీపీలో చేరిన 30 కుటుంబాలు
- కాకాణి సమక్షంలో టీడీపీని వీడిన కుటుంబాలు
- పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించిన మాజీ మంత్రి కాకాణి
- మాతమ్మ దేవాలయంలో ప్రత్యేక ప్రార్థనలతో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం
- జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి రావడానికి స్థానిక ఎన్నికలే నాంది కావాలి:
- ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపు

**పొదలకూరు,(అక్షరదర్శిని) :** పొదలకూరు మండలం దుగ్గుంట గ్రామంలో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం హోరెత్తింది. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి డాక్టర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డికి గ్రామంలో అడుగడుగునా ప్రజలు నీరాజనాలు పలికారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామంలో నిర్వహించిన ఇంటింటా ప్రచార కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీకి చెందిన 30 కుటుంబాలు ఆ పార్టీని వీడి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి కాకాణి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

**మాతమ్మ ఆశీస్సులతో ప్రచారానికి శ్రీకారం** ముందుగా గ్రామంలోని మాతమ్మ దేవాలయాన్ని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పొదలకూరు మండల జడ్పీటీసీ అభ్యర్థి బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి (చిన్ని), దుగ్గుంట ఎంపీటీసీ అభ్యర్థి బండి చిన్నయ్య సందర్శించారు. అమ్మవారికి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం గ్రామంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేపట్టారు. ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో



అమలైన సంక్షేమ పథకాలను వివరిస్తూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

**టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి 30 కుటుంబాలు** దుగ్గుంట గ్రామంలో తెలుగుదేశం పార్టీకి చెందిన 30 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరడం స్థానికంగా రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మిగతా 3 లో.......

04



## బీ-ఫారాల పంచాయితీతో
# టీడీపీలో కలకలం!

- మంత్రి ఆనం ఆగ్రహం వెనుక అసలేం జరిగింది?
- బీదా రవిచంద్ర, డూండి రాకేష్ తీరుపై అసంతృప్తి..

నెల్లూరు టీడీపీలో మళ్లీ వర్గ విభేదాల చర్చ!

మిగతా 4 లో.......



# తోపుగుంట సమీపంలో రోడ్డు ప్రమాదం.. యువకుడు మృతి

▶▶ కలువాయిలో విషాదఛాయలు.. కుటుంబ సభ్యుల కన్నీరుమున్నీరు

**కలువాయి,(అక్షర దర్శిని) :** నెల్లూరు జిల్లా కలువాయి గ్రామానికి చెందిన గుంజి చందు (22) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఏసీ టెక్నీషియన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్న చందు మృత్యువాత పడటంతో అతని కుటుంబంలో విషాదం నెలకొంది. వివరాల్లోకి వెళితే.. ఏసీకి సంబంధించిన వస్తువుల కొనుగోలు కోసం చందు సోమవారం సాయంత్రం నెల్లూరుకు వెళ్లాడు. అక్కడ పనులు ముగించుకుని బైక్‌పై తిరిగి వస్తుండగా రాత్రి తోపుగుంట సమీపంలో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో చందు తీవ్రంగా గాయపడి మృతి చెందినట్లు సమాచారం. సమాచారం అందుకున్న 108 అత్యవసర వైద్య సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా, అప్పటికే చందు మృతి చెందినట్లు గుర్తించారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చందు ప్రయాణిస్తున్న బైక్ అదుపుతప్పి బోల్తా పడటంతో ప్రమాదం జరిగిందా? లేక గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడం వల్ల మృతి చెందాడా? అనే కోణాల్లో పోలీసులు విచారణ జరుపుతున్నారు. ప్రమాదానికి గల అసలు కారణాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. చందు మృతి వార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. చేతికి అందివచ్చిన యువకుడు చిన్న వయసులోనే మృతి చెందడంతో కలువాయి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థులకు బీ-ఫారాలు అందజేత

▶▶ అభ్యర్థులతో ప్రమాణం చేయించిన జిల్లా అధ్యక్షుడు బీదా రవిచంద్ర




**నెల్లూరు,(అక్షర దర్శిని) :** నెల్లూరులోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో జడ్పీటీసీ అభ్యర్థులకు పార్టీ జిల్లా అధ్యక్షుడు బీదా రవిచంద్ర బీ-ఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ సభ్యులతో ఆయన ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థులకు బీ-ఫారాలు అందజేయడంతో పాటు, ఎన్నికల్లో అనుసరించాల్సిన విధానాలు, పార్టీ అభ్యర్థుల బాధ్యతలపై నాయకులు దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, జడ్పీటీసీ అభ్యర్థులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.








# విరువూరులో వైసీపీ ప్రచార హోరు





▶▶ కాకాణి నాయకత్వంలో విజయమే లక్ష్యంగా ముందుకు..

▶▶ ఇంటింటా ప్రచారంలో దూసుకుపోతున్న వైసీపీ అభ్యర్థులు

▶▶ పొదలకూరు మండలంలో వైసీపీ జెండా ఎగరేయడమే లక్ష్యం

▶▶ జడ్పీటీసీ అభ్యర్థి బచ్చుల సురేష్ కుమార్ రెడ్డి(చిన్ని), ఎంపీటీసీ అభ్యర్థి వాణి విస్తృత ప్రచారం

**పొదలకూరు,(అక్షర దర్శిని) :** పొదలకూరు మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల వేడి రాజుకుంది. విరువూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు డాక్టర్ కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆశీస్సులు, నాయకత్వంలో పార్టీ అభ్యర్థులు విజయమే లక్ష్యంగా ప్రచారాన్ని ముమ్మరం చేశారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలిరావడంతో విరువూరు గ్రామంలో సందడి నెలకొంది.

**వినాయకుని ఆశీస్సులతో ప్రచారానికి శ్రీకారం** ఎన్నికల ప్రచారంలో భాగంగా ముందుగా గ్రామంలోని శ్రీ వినాయకస్వామి ఆలయంలో వైసీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జడ్పీటీసీ అభ్యర్థి బచ్చుల సురేష్ కుమార్ రెడ్డి, ఎంపీటీసీ అభ్యర్థి వాణి పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటా ప్రచారం చేపట్టారు. ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

**కాకాణి నాయకత్వమే మా బలం..** సర్వేపల్లి నియోజకవర్గంలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి నాయకత్వమే తమకు బలమని వైసీపీ నాయకులు పేర్కొన్నారు. ఆయన ఆశీస్సులతో పొదలకూరు మండలంలో వైసీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసి ప్రతి ఎంపీటీసీ స్థానంతో పాటు జడ్పీటీసీ స్థానాన్ని కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

**కూటమి పాలనకు ఓటుతో బుద్ధి చెప్పాలి..** కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని వైసీపీ నాయకులు విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తమ ఓటుతో కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా వైసీపీ శ్రేణులు వెనక్కి తగ్గబోవని స్పష్టం చేశారు.

**పొదలకూరు మండలమంతా వైసీపీ జెండా ఎగరాలి..** పొదలకూరు మండలంలోని ప్రతి గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలాడేలా కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. కాకాణి గోవర్ధన్ రెడ్డి మార్గదర్శకత్వంలో పార్టీ అభ్యర్థులందరినీ గెలిపించుకోవడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల ఆశీస్సులు, కార్యకర్తల కృషితో స్థానిక ఎన్నికల్లో వైసీపీ సత్తా చాటుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో వైసీపీ నాయకులు, మహిళలు, యువకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఇంటింటా ప్రచారంతో విరువూరు గ్రామంలో వైసీపీ శ్రేణులు ఎన్నికల సందడి సృష్టించాయి. స్థానిక ఎన్నికల్లో సత్తా చాటి సర్వేపల్లిలో వైసీపీ బలాన్ని మరోసారి నిరూపిస్తామని నాయకులు ధీమా వ్యక్తం చేశారు.

# వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించండి





మొదటి పేజీ తరువాయి

పేరుతో ప్రజలపై భారం మోపుతున్నారని, చెట్లు, చెత్త పేరుతో వసూలు చేసిన నిధులను నగరాభివృద్ధికి వినియోగించడం లేదని ఆరోపించారు. నెల్లూరు నగర ప్రజల అభివృద్ధి, సంక్షేమంపై పాలకులు తగిన శ్రద్ధ చూపడం లేదని అన్నారు.

**ఆనం కుటుంబానికి నగర సేవల అనుభవం** నెల్లూరు నగరానికి ఆనం కుటుంబం అనేక తరాలుగా సేవలందించిందని కాకాణి పేర్కొన్నారు. అనుభవజ్ఞుడైన ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ మేయర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారని, ప్రజలు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఆయనతో పాటు 59వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి కిషన్‌ను గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లందరినీ గెలిపించి మంచి బృందాన్ని అందిస్తే విజయ్‌కుమార్‌రెడ్డి నాయకత్వంలో నెల్లూరు నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించవచ్చని అన్నారు.

**పోలీసుల తీరుపై ఆరోపణలు** జిల్లాలో కొందరు పోలీసు అధికారులు తమ విధులను పక్కనపెట్టి అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని కాకాణి ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ నాయకులను పోటీ నుంచి తప్పుకోవాలని బెదిరిస్తూ, సీట్ల విషయంలో బేరసారాలు చేస్తున్నారంటూ విమర్శించారు. పోలీసు అధికారులు శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా విధులు నిర్వహించాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను బెదిరించడం, వ్యాపారులను, స్థానిక నాయకులను ఒత్తిడికి గురిచేయడం, నామినేషన్లను తిరస్కరించేలా ప్రయత్నించడం వంటి చర్యలతో ఏకగ్రీవాలు సాధించాలని అధికార పక్షం చూస్తోందని ఆరోపించారు. అధికార బలంతో కాకుండా ప్రజల ఓట్లతోనే ఎన్నికల్లో గెలవాలని అధికార కూటమికి హితవు పలికారు.

**స్వేచ్ఛాయుత ఎన్నికలు నిర్వహించాలి** కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో అసంతృప్తి పెరిగిందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన నిర్ణయం తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నారని కాకాణి అన్నారు. నెల్లూరు నగరంలో వ్యాపార వర్గాలు, ఆర్యవైశ్యుల సంక్షేమం గురించి ఆలోచించి సేవలందించిన కుటుంబాల్లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుటుంబం, ఆనం కుటుంబం ఉన్నాయని పేర్కొన్నారు. ఎన్నికల్లో బెదిరింపులు, ప్రలోభాలు, బ్లాక్‌మెయిలింగ్‌కు లొంగకుండా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలను ప్రజాస్వామ్యబద్ధంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీని కోరినట్లు తెలిపారు..

# పొదలకూరులో టీడీపీ ఎన్నికల ప్రచార హోరు





▶▶ బిట్--3, బిట్--4 ఎంపీటీసీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి..

▶▶ ఏసీ కాలనీ, రాపూరు రోడ్డులో విస్తృతంగా ప్రచారం

**పొదలకూరు,(అక్షర దర్శిని):** పొదలకూరు పట్టణంలో తెలుగుదేశం పార్టీ ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తిస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం ఏసీ కాలనీ, రాపూరు రోడ్డులో పొదలకూరు బిట్--3, బిట్--4 ఎంపీటీసీ స్థానాల నుంచి పోటీ చేస్తున్న టీడీపీ అభ్యర్థులు షేక్ ఖాదర్ భాష, తాటి బోయిన రమణమ్మలతో కలిసి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆశీస్సులతో బరిలో ఉన్న తమకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థులు ప్రజలను కోరారు.

**స్థానిక సమస్యల పరిష్కారమే లక్ష్యం** టీడీపీ అభ్యర్థులను గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటూ స్థానిక సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని ప్రచారంలో పేర్కొన్నారు. పొదలకూరు మండల అభివృద్ధిలో తెలుగుదేశం పార్టీ కీలక పాత్ర పోషించిందని పార్టీ నాయకులు తెలిపారు. పట్టణ సుందరీకరణలో భాగంగా సుమారు రూ. 2 కోట్ల వ్యయంతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

**అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం** కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంతో పాటు విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యమిస్తోందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మండల పరిషత్ లో గత 15 ఏళ్లుగా పాలన వెలగబెట్టిన ప్రబుద్ధులు వ్యవస్థలను భ్రష్టు పట్టించారని ఆరోపించారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం, స్థానిక సమస్యలను పరిష్కరించడం తమ ప్రధాన లక్ష్యమని ప్రచారంలో వివరించారు. ఈ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కొంగి మస్తానమ్మ, టీడీపీ నాయకులు కొంగి వెంకట రమణయ్య, బోగోలు భాస్కర్‌రెడ్డి, దార్ల ఆశీర్వాదం, గుర్రం మీరా మధుతో పాటు స్థానిక ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. బిట్--3, బిట్--4 ఎంపీటీసీ స్థానాల్లో తమ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని వారు ఓటర్లను కోరారు.

# పోస్టల్ బ్యాలెట్‌ను సక్రమంగా వినియోగించుకోవాలి





▶▶ ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బందికి కలెక్టర్ హిమాన్షు శుక్లా పిలుపు

**నెల్లూరు,(అక్షర దర్శిని):** స్థానిక సంస్థల ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న అధికారులు, సిబ్బంది ఎన్నికల సంఘం నిబంధనలను పాటిస్తూ పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పిలుపునిచ్చారు. ప్రతి ఉద్యోగి తన ఓటు చెల్లుబాటు అయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.మంగళవారం నెల్లూరులోని శ్రీ వెంకటేశ్వర కస్తూర్బా కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ నందన్, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి నాగరాజకుమారి ఓటింగ్ ప్రక్రియను ఆయనకు వివరించారు. అనంతరం సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే విధానంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సూచించారు. ఓటింగ్ సమయంలో ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే ముందుగానే సంబంధిత అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని పేర్కొన్నారు. ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఎన్నికల విధుల ఉత్తర్వుల ప్రతితో పాటు ఓటరు గుర్తింపు కార్డు, ఆధార్ కార్డును వెంట తీసుకురావాలని సూచించారు.నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో అక్టోబర్ 27, 28 తేదీల్లో, ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటీల పరిధిలో అక్టోబర్ 27 నుంచి 29వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.ఈ కార్యక్రమంలో డీఈఓ బాలాజీరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కేశవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దుగ్గుంటలో కాకాణికి అడుగడుగునా జన నీరాజనం





## మొదటి పేజీ తరువాయి

సమక్షంలో పార్టీలో చేరిన వారందరికీ వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల వేళ ప్రజలు వైఎస్సార్‌సీపీ వైపు మొగ్గుచూపుతున్నారని కాకాణి పేర్కొన్నారు.

**జగన్ గెలుపునకు స్థానిక ఎన్నికలే నాంది కావాలి** ఈ సందర్భంగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు ఈ స్థానిక సంస్థల ఎన్నికలే నాంది కావాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచే వైఎస్సార్‌సీపీ విజయపరంపర ప్రారంభం కావాలన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించారని గుర్తుచేశారు. ప్రజల ఆదరణే వైఎస్సార్‌సీపీకి అసలైన బలమని, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. దుగ్గుంటలో 30 కుటుంబాలు పార్టీలో చేరడం ప్రజల్లో వైఎస్సార్‌సీపీ పట్ల పెరుగుతున్న ఆదరణకు నిదర్శనమని పేర్కొన్నారు.

**ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించండి** పొదలకూరు మండల జడ్పీటీసీ అభ్యర్థి బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి (చిన్ని), దుగ్గుంట ఎంపీటీసీ అభ్యర్థి బండి చిన్నయ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని కాకాణి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని అభ్యర్థులు పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వా రి నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని తెలిపారు.నవంబర్ 3న జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సర్వేపల్లిలో టీడీపీలోకి భారీగా వలసలు





▶▶ 2024 ఎన్నికలకు మించి చేరికలు జరుగుతున్నాయి

▶▶ మల్లికార్జునపురానికి చెందిన 36 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరిక

**నెల్లూరు,(అక్షర దర్శిని):** సర్వేపల్లి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలోకి చేరికలు రోజురోజుకూ పెరుగుతున్నాయని, 2024 ఎన్నికల సమయంలో కంటే ప్రస్తుతం అధిక సంఖ్యలో చేరికలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. తోటపల్లిగూడూరు మండలం మల్లికార్జునపురానికి చెందిన 36 కుటుంబాలు వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలో చేరాయి. నెల్లూరు అల్లీపురంలో జరిగిన కార్యక్రమంలో సోమిరెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

**అభివృద్ధి, సంక్షేమానికి ఆకర్షితులై చేరికలు** ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ మల్లికార్జునపురం తన దత్తత గ్రామమని, గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ఆ గ్రామ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం గ్రామ బాధ్యతలను ఎస్ఈఐఎల్ (రాజు×రా) కంపెనీ చేపట్టి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమాలకు ఆకర్షితులై టీడీపీలో చేరిన 36 దళిత, గిరిజన కుటుంబాలకు స్వాగతం పలుకుతున్నట్లు పేర్కొన్నారు.గ్రామంలో ఒక్కొక్కటి రూ.30 లక్షలకు పైగా విలువ చేసే రెండు మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. 280 కుటుంబాలకు నిత్యజీవితంలో ఉపయోగపడే వస్తువులతో కూడిన వెల్‌కమ్ కిట్లను కంపెనీ అందించిందన్నారు. మరోవైపు 30 కుటుంబాలకు గొర్రెలు, ఇంకో 30 కుటుంబాలకు మేకలను పంపిణీ చేసినట్లు వివరించారు. రెండో విడతలో మిగిలిన కుటుంబాలకు కూడా వాటిని అందించనున్నట్లు చెప్పారు. పెరటి తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తూ గ్రామస్థులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు సహకారం అందిస్తున్నట్లు వెల్లడించారు.

**దళిత, గిరిజనుల అభ్యున్నతికి ప్రాధాన్యం** మల్లికార్జునపురంలో దళితులు, గిరిజనులు అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రభుత్వ నిధులకు అదనంగా ఖర్చు చేసి పేదలకు నాణ్యమైన ఇళ్ల నిర్మాణం చేపట్టినట్లు సోమిరెడ్డి తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గవ్యాప్తంగా దళిత, గిరిజన వర్గాల అభ్యున్నతికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. నియోజకవర్గంలో నిరంతరం టీడీపీలో చేరికలు జరుగుతుండటం సంతోషంగా ఉందన్నారు. పొదలకూరు మండలంలోనూ తొలిసారిగా టీడీపీకి విశేష స్పందన లభిస్తోందని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల మద్దతుతో భారీ విజయాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

**సంక్షేమ పథకాలతో ప్రజలకు ప్రయోజనం** కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు విస్తృతంగా కొనసాగుతున్నాయని సోమిరెడ్డి అన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తీసుకున్న నిర్ణయాలు గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌ల అభివృద్ధికి దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. ఆర్థిక సంఘం నిధులతో పాటు స్థానిక సంస్థలకు వచ్చే ఇతర నిధులు కూడా పల్లెల అభివృద్ధికే వినియోగించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.విద్యారంగంలో మంత్రి నారా లోకేశ్ మార్పులు తీసుకొస్తున్నారని, తల్లికి వందనం పథకం ద్వారా కుటుంబంలో చదువుకుంటున్న పిల్లలందరికీ ప్రయోజనం కల్పిస్తున్నట్లు తెలిపారు. స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, దీపం పథకం ద్వారా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అందుతున్నాయని వివరించారు. అన్నదాత సుఖీభవ పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రైతులకు ఏడాదికి రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో పాటు కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులను కూడా సద్వినియోగం చేసుకుంటూ సర్వేపల్లి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామని సోమిరెడ్డి తెలిపారు.

**పార్టీలో చేరిన వారిలో..**టీడీపీలో చేరిన వారిలో కత్తి శ్రీను, పచ్చా రాజేష్, గంధళ్ల ఇంద్ర, కత్తి శివకృష్ణ, చలంచర్ల వెంకటరమణయ్య, కవరగిరి శ్రీను, తుపాకుల అరవింద్, ఈగా సనత్‌కుమార్, పోట్లూరు హేమంత్, బోడెద్దుల శీనయ్య, శీలం మణి, కత్తి పుల్లయ్య, గంధళ్ల మణి తదితరులు ఉన్నారు.



## జనంలో మమేకమవుతూ పొంగూరు షరణి ప్రచారం

▶▶ ఆటో నడుపుతూ.. రిక్షా తొక్కుతూ ఓటర్లతో మమేకం

**నెల్లూరు,(అక్షర దర్శిని):** రాష్ట్ర మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ కుమార్తె షరణి కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రచారంలో భాగంగా ఆమె స్వయంగా ఆటో నడపడం, రిక్షా తొక్కడం, కూరగాయలు విక్రయించడం వంటి కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్తున్నారు. కార్యకర్తలతో కలిసి క్యారమ్స్ ఆడుతూ, ఓటర్లతో ముచ్చటిస్తూ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు.కూటమి మేయర్ అభ్యర్థి రూప్‌కుమార్ యాదవ్‌తో పాటు 66వ డివిజన్ అభ్యర్థి కప్పిర రేవతి, 67వ డివిజన్ అభ్యర్థి నిమ్మల ప్రసన్నకుమారి, 68వ డివిజన్ అభ్యర్థి కట్టమూరి శైలజ, 69వ డివిజన్ అభ్యర్థి షేక్ షాహినాకు మద్దతుగా ఓటర్లను కలుస్తూ ప్రచారం చేస్తున్నారు. తండ్రి నారాయణ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ఆమె కోరుతున్నారు.



# స్థానిక సంస్థల ఎన్నికలకు 74 మంది మైక్రో అబ్జర్వర్లు

**నెల్లూరు,(అక్షర దర్శిని) :** జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి మైక్రో అబ్జర్వర్ల కేటాయింపు ప్రక్రియను మంగళవారం ఎన్నికల పరిశీలకురాలు సదా భార్గవి ఆధ్వర్యంలో రాండమైజేషన్ పద్ధతిలో నిర్వహించారు. ఆత్మకూరు మున్సిపాలిటీ, బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటీ, నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో ఎన్నికల విధుల నిర్వహణ కోసం మొత్తం 74 మంది మైక్రో అబ్జర్వర్లను కేటాయించారు. వీరిలో 62 మందిని ప్రధాన విధులకు, మరో 12 మందిని రిజర్వ్‌గా నియమించారు. మున్సిపాలిటీల వారీగా ఆత్మకూరుకు 14 మంది, బుచ్చిరెడ్డిపాళెంకు ఐదుగురు, నెల్లూరు నగరపాలక సంస్థకు 55 మంది చొప్పున మైక్రో అబ్జర్వర్లను కేటాయించినట్లు అధికారులు తెలిపారు. ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించడం, పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు తోడ్పడటం లక్ష్యంగా ఈ కేటాయింపులు చేపట్టారు.ఈ కార్యక్రమంలో సీపీఓ లక్ష్మీ నరసింహం, ఏపీఐఐసీ జెడ్ఎం శివకుమార్, శోభారాణి, ఎన్ఐసీ సభ్యులు పాల్గొన్నారు.

# అభివృద్ధిని ఆదరించండి.. టీడీపీని గెలిపించండి!

▶▶ అంకుపల్లి గ్రామస్థులతో మమేకమైన టీడీపీ అభ్యర్థులు..

▶▶ జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా విస్తృత ప్రచారం



**పొదలకూరు,(అక్షర దర్శిని):** అభివృద్ధిని ఆదరించి తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను గెలిపించాలని టీడీపీ మండల అధ్యక్షుడు, పీఏసీఎస్ చైర్మన్ తలచీరు మస్తాన్‌బాబు పిలుపునిచ్చారు. పొదలకూరు మండలం అంకుపల్లి గ్రామంలో మంగళవారం సాయంత్రం జడ్పీటీసీ అభ్యర్థి కలిచేటి ప్రభాకర్‌రెడ్డి, ఆర్.వై.పాలెం ఎంపీటీసీ అభ్యర్థి మైలా కోటేశ్వరరావు పార్టీ నాయకులతో కలిసి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా మస్తాన్‌బాబు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ పాలనలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఆదరించాలని కోరారు. సాగునీరు, తాగునీరు, మౌలిక సదుపాయాల కల్పనలో సోమిరెడ్డి కృషి చేశారని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి టీడీపీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

**ఇంటింటికీ వెళ్లి మద్దతు కోరిన అభ్యర్థులు** జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులు గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. గ్రామంతోపాటు ఎస్సీ కాలనీలోనూ పర్యటించి ఓటర్లతో మమేకమయ్యారు. కూటమి అభ్యర్థులకు మద్దతు తెలిపి గెలిపించాలని కోరుతూ ఎన్నికల కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రచార సమయంలో గ్రామస్థులు అభ్యర్థులకు స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు పులిపాటి వెంకటరత్న నాయుడు, సర్వేపల్లి జనసేన నాయకుడు నారదాసు రవి, కోడూరు పెంచల భాస్కర్‌రెడ్డి, పెంచల నాయుడు, ఆవులపాటి పిచ్చినాయుడు, నాగినేని పెంచల సుబ్బానాయుడు, నాగినేని ప్రభాకర్‌నాయుడు, కొప్పాల రాఘవులు, మోహన్, గూడపాటి కృష్ణమూర్తి, వేంకటరమణయ్య, అత్తెన శ్రీనివాసులు, అడసనపల్లి పెంచలయ్య, యాదాల కోటి, రాపూరు రత్నం, పంతగిరి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో విశేష పూజలు



**నెల్లూరు,(అక్షర దర్శిని) :** నెల్లూరులోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో సోమవారం, అక్టోబర్ 27న అమ్మవారికి ప్రత్యేక పూజలు, వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ కార్యక్రమాల్లో భాగంగా అమ్మవారికి విశేష అలంకరణలు చేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో శ్రీ చక్రార్చన, కలశారాధన తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించినట్లు దేవస్థానం అధికారులు వెల్లడించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం తరపున ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. దేవస్థానంలో నిర్వహించే నిత్య పూజలు, విశేష ఉత్సవాలు భక్తుల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందిస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు.

# కలువాయిలో ఎంపీటీసీ ఎన్నికల పోరు ఆసక్తికరం

▸▸ 12 సెగ్మెంట్లలో 26 మంది అభ్యర్థులు.. సెగ్మెంట్-1పై సర్వత్రా ఆసక్తి!





**కలువాయి,(అక్షర దర్శిని) :** నెల్లూరు జిల్లా కలువాయి మండలంలో ఎంపీటీసీ ఎన్నికల పోరు రసవత్తరంగా మారింది. మండలంలోని 12 సెగ్మెంట్లలో మొత్తం 26 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలవడంతో రాజకీయ సందడి నెలకొంది. ప్రధానంగా తెలుగుదేశం పార్టీ (టీడీపీ), వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైఎస్సార్‌సీపీ) అభ్యర్థుల మధ్య పోటీ కొనసాగుతుండగా, కొన్ని సెగ్మెంట్లలో ఇతర పార్టీల అభ్యర్థులు కూడా బరిలో ఉండటంతో ఎన్నికల సమీకరణాలు ఆసక్తికరంగా మారాయి.

**తోపుగుంట, కుల్లూరులో బహుముఖ పోటీ** మండలంలోని తోపుగుంట సెగ్మెంట్‌లో టీడీపీ, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులతో పాటు భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అభ్యర్థి కూడా పోటీ చేస్తున్నారు. కుల్లూరు సెగ్మెంట్‌లో జనసేన, వైఎస్సార్‌సీపీ, బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. మిగిలిన పది సెగ్మెంట్లలో ప్రధానంగా టీడీపీ, వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల మధ్యే పోటీ కొనసాగుతోంది.

**సెగ్మెంట్-1పై ప్రత్యేక దృష్టి** అన్ని సెగ్మెంట్లలోనూ కలువాయి సెగ్మెంట్-1 ఎన్నికల పోరు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. టీడీపీ మండల అధ్యక్షుడు చల్లా రఘురామిరెడ్డి బరిలో ఉండగా, వైఎస్సార్‌సీపీ తరపున మాజీ జెడ్పీటీసీ అనిల్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. ఇద్దరూ రాజకీయంగా గుర్తింపు ఉన్న నాయకులు కావడంతో ఈ సెగ్మెంట్ ఫలితంపై స్థానిక రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఇద్దరు అభ్యర్థులు తమ తమ పార్టీల మద్దతుతో విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతుండటంతో ప్రచార వ్యూహాలు, ఓటర్ల మద్దతు వంటి అంశాలు చర్చనీయాంశంగా మారాయి. ఈ సెగ్మెంట్‌లో ఎవరు పైచేయి సాధిస్తారన్నది స్థానికంగా ఉత్కంఠ రేపుతోంది. మొత్తంగా 12 సెగ్మెంట్లలో 26 మంది అభ్యర్థులు పోటీలో ఉండటంతో కలువాయి మండలంలో ఎంపీటీసీ ఎన్నికల వాతావరణం వేడెక్కింది. ముఖ్యంగా సెగ్మెంట్-1 ఫలితం ఎలా ఉండబోతోందన్న ఆసక్తి రాజకీయ శ్రేణులతో పాటు స్థానిక ప్రజల్లోనూ నెలకొంది.

## జిల్లాలో ఐదు జెడ్పీటీసీ స్థానాలు ఏకగ్రీవం

▸▸ ఐదు స్థానాలూ టీడీపీ ఖాతాలోకి..



**నెల్లూరు,(అక్షర దర్శిని) :** జిల్లాలో జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి ఐదు స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. చిల్లకూరు, సీతారాంపురం, బుచ్చిరెడ్డిపాలెం, ఇందుకూరుపేట, కొడవలూరు జెడ్పీటీసీ స్థానాల్లో తెలుగుదేశం పార్టీ (టీడీపీ) అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ఈ ఐదు స్థానాలు ఏకగ్రీవం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఆయా స్థానాల్లో ప్రత్యర్థి అభ్యర్థులు లేకపోవడం లేదా పోటీ నుంచి తప్పుకోవడం వంటి కారణాలతో ఏకగ్రీవ ఎన్నికకు అవకాశం ఏర్పడింది. దీంతో ఐదు జెడ్పీటీసీ స్థానాలు టీడీపీ ఖాతాలో చేరినట్లయింది. మిగిలిన జెడ్పీటీసీ స్థానాల్లో ఎన్నికల పోరు కొనసాగుతుండటంతో ఆయా ప్రాంతాల్లో రాజకీయ పార్టీల ప్రచారం, అభ్యర్థుల వ్యూహాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## అక్రమ కేసులతో అరెస్టులను ఖండిస్తున్నాం

**-పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నారు.. కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శలు**

నెల్లూరు,(అక్షర దర్శిని): స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి భయంతో కూటమి ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకుని ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు బనాయిస్తోందని మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. గూడూరు రూరల్ మండలం రామలింగాపురంలో మద్యం బాటిళ్ల కేసులో అరెస్టయినట్లు పేర్కొన్న వైఎస్సార్‌సీపీ నాయకుడు అట్ల శ్రీనివాసులురెడ్డి కుటుంబాన్ని గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త బూదూరు గురవయ్యతో కలిసి ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ.. శ్రీనివాసులురెడ్డిని రాజకీయంగా దెబ్బతీసేందుకే అక్రమ కేసు బనాయించారని ఆరోపించారు. మద్యం బాటిళ్లు ఎక్కడి నుంచి వచ్చాయి, వాటిని ఎవరు ఉంచారనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలని ఎస్పీని కోరారు. సంబంధిత కేసులపై పునఃసమీక్ష చేపట్టాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో విఫలమైందని, ప్రజా వ్యతిరేకతను ఎదుర్కోలేక బెదిరింపులు, కేసుల ద్వారా ప్రతిపక్ష శ్రేణులను భయభ్రాంతులకు గురిచేస్తోందని విమర్శించారు. గూడూరుతో పాటు వాకాడు, చిట్టమూరు, పెళ్లకూరు ప్రాంతాల్లోనూ వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. మహిళలను నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు బెదిరింపులకు భయపడరని, పార్టీ వారికి అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ధైర్యం ఉంటే ప్రజాక్షేత్రంలో పోటీ చేసి గెలవాలని అధికార పక్షానికి సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



# బీ-ఫారాల పంచాయితీతో టీడీపీలో కలకలం!



**నెల్లూరు,(అక్షర దర్శిని):** జిల్లా తెలుగుదేశం పార్టీలో జడ్పీటీసీ బీ-ఫారాల పంపిణీ వ్యవహారం కొత్త రాజకీయ చర్చకు తెరలేపింది. అభ్యర్థుల ఎంపిక, నాయకుల మధ్య సమన్వయం, నియోజకవర్గాల వారీగా ఆధిపత్యం వంటి అంశాలు ఇప్పుడు పార్టీలో హాట్‌టాపిక్‌గా మారాయి. ముఖ్యంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అసంతృప్తి వ్యక్తం చేసినట్లు జరుగుతున్న ప్రచారం జిల్లా టీడీపీ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

**బీ-ఫారాల పంపిణీతో మొదలైన వివాదం!** జిల్లా టీడీపీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు బీదా రవిచంద్ర జడ్పీటీసీ అభ్యర్థులకు బీ-ఫారాలు అందజేసిన నేపథ్యంలో ఆత్మకూరు నియోజకవర్గానికి సంబంధించిన అభ్యర్థుల ఎంపికపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నట్లు సమాచారం. తన నియోజకవర్గంలో పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తున్నారని భావిస్తున్న నాయకుల ప్రమేయంతో అభ్యర్థులకు బీ-ఫారాలు ఎలా కేటాయిస్తారనే అంశంపై మంత్రి ఆనం అసంతృప్తి వ్యక్తం చేసినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

అంతేకాకుండా జిల్లా పార్టీ కార్యాలయంలో సంబంధిత నాయకులకు ప్రాధాన్యత కల్పించే విషయంలోనూ మంత్రి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు చర్చ సాగుతోంది. అయితే ఈ ఆరోపణలు, ప్రచారంపై మంత్రి ఆనం లేదా సంబంధిత నాయకుల నుంచి అధికారిక వివరణ వెలువడాల్సి ఉంది.

**జిల్లా నాయకత్వం మధ్య సమన్వయం ఎక్కడ?** జిల్లా పార్టీ అధ్యక్షుడు బీదా రవిచంద్ర, పార్టీ పరిశీలకుడు గుండి రాకేష్ వ్యవహారశైలిపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేసినట్లు జరుగుతున్న ప్రచారం పార్టీలో సమన్వయంపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. అభ్యర్థుల ఎంపికలో స్థానిక ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జీల అభిప్రాయాలకు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారు? జిల్లా నాయకత్వం నిర్ణయాలు తీసుకునే సమయంలో అందరినీ సంప్రదిస్తోందా? అనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది.

**జెడ్పీ చైర్మన్ ఎంపికలోనూ భిన్నాభిప్రాయాలా?** జిల్లా పరిషత్ చైర్మన్ అభ్యర్థి ఎంపిక సమయంలోనూ నాయకుల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నట్లు గతంలో ప్రచారం జరిగింది. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సూచించినట్లు చెప్పబడుతున్న పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేరు, బీదా రవిచంద్ర మద్దతు తెలిపినట్లు ప్రచారంలో ఉన్న వంటేరు వేణుగోపాల్‌రెడ్డి పేరు చుట్టూ చర్చ సాగింది. చివరకు పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేరు ముందుకు రావడంతో ఆ వ్యవహారం అప్పట్లో రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. తాజాగా బీ-ఫారాల పంపిణీ వ్యవహారం మరోసారి నాయకుల మధ్య సమన్వయంపై చర్చకు కారణమైంది. అయితే గత పరిణామాలకు, ప్రస్తుత వివాదానికి ప్రత్యక్ష సంబంధం ఉందనే విషయంపై స్పష్టమైన అధికారిక సమాచారం లేదు.

**అధిష్ఠానం దృష్టి సారిస్తుందా?** ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, జిల్లా అధ్యక్షుడు బీదా రవిచంద్ర సహా కీలక నేతల మధ్య సమన్వయం స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రాధాన్యత సంతరించుకుంది. అభ్యర్థుల ఎంపిక విషయంలో తలెత్తుతున్నట్లు చెబుతున్న విభేదాలు పార్టీ ఎన్నికల వ్యూహంపై ప్రభావం చూపుతాయా? అధిష్ఠానం జోక్యంతో నాయకుల మధ్య ఏకాభిప్రాయం కుదురుతుందా? అన్న ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన బీ-ఫారాల పంపిణీ కార్యక్రమానికి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో పాటు పలువురు ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో బీ-ఫారాల వ్యవహారంపై సాగుతున్న ప్రచారానికి సంబంధించి పార్టీ నాయకత్వం స్పందన ఎలా ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది. ఎన్నికల వేళ అభ్యర్థుల ఎంపికే ఐక్యతకు పరీక్షగా మారుతోందా? అన్న చర్చ నెల్లూరు జిల్లా టీడీపీ రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.

# నగర అభివృద్ధి కొనసాగాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలి

▸▸ మంత్రి నారాయణ జీవితం ప్రజాసేవకే అంకితం

▸▸ 13, 60వ డివిజన్లలో డాక్టర్ సింధూర ఎన్నికల ప్రచారం



**నెల్లూరు,(అక్షర దర్శిని):** నెల్లూరు నగర అభివృద్ధి కొనసాగాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలని మంత్రి నారాయణ కుమార్తె డాక్టర్ సింధూర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం నగరంలోని 13, 60వ డివిజన్లలో బీజేపీ అభ్యర్థులు పత్తిపాటి కావ్య, కూరపాటి రఘునాథరాజులకు మద్దతుగా ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సింధూర మాట్లాడుతూ మంత్రి నారాయణ నేతృత్వంలో నెల్లూరు నగరానికి సుమారు రూ.6,000 కోట్ల నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. రహదారులు, డ్రైనేజీలు, పార్కులు, భూగర్భ మురుగునీటి వ్యవస్థ, ఇంటింటికీ తాగునీటి సరఫరా, ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణ వంటి కార్యక్రమాలతో నగర రూపురేఖలు మారుతున్నాయని పేర్కొన్నారు.

సామాన్య కుటుంబం నుంచి వచ్చిన నారాయణకు పేదల సమస్యలపై అవగాహన ఉందని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నారని అన్నారు. నగరంలో అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగేందుకు 13, 60వ డివిజన్ల బీజేపీ అభ్యర్థులతో పాటు కూటమి మేయర్ అభ్యర్థి రూప్‌కుమార్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో స్థానిక నాయకులు, కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

## జనసేన, బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నారాయణ రోడ్‌షోలు

▸▸ కూటమి ధర్మంలో భాగంగా మిత్రపక్షాల ప్రచార బాధ్యతలు భుజానికెత్తుకున్న మంత్రి

▸▸ 7, 15, 21వ డివిజన్లలో సందడి.. హారతులతో మహిళల స్వాగతం



**నెల్లూరు,(అక్షర దర్శిని) :** నెల్లూరు నగరపాలక సంస్థ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా మంత్రి పొంగూరు నారాయణ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. టీడీపీ అభ్యర్థులతో పాటు జనసేన, బీజేపీ అభ్యర్థుల గెలుపునూ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని, మిత్రపక్షాల తరఫున స్వయంగా ప్రచార బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం నగరంలోని 7, 15, 21వ డివిజన్లలో రోడ్‌షోలు నిర్వహించారు. 21వ డివిజన్ ప్రచారంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. రోడ్‌షోల సందర్భంగా మహిళలు మంగళహారతులతో నేతలకు స్వాగతం పలకగా, పార్టీ కార్యకర్తల సందడితో ఆయా ప్రాంతాలు ఎన్నికల వాతావరణాన్ని సంతరించుకున్నాయి. బీజేపీ అభ్యర్థి సిరిగిరి లక్ష్మికి కమలం గుర్తుపై, జనసేన అభ్యర్థులు కెజియా కుమారి, గునుకుల లక్ష్మిలకు గాజు గ్లాసు గుర్తుపై, టీడీపీ మేయర్ అభ్యర్థి రూప్‌కుమార్ యాదవ్‌కు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ఓటర్లను కోరారు.

**అభివృద్ధే ప్రచార అజెండా** నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజలకు ఇచ్చిన హామీల అమలును వివరిస్తూ నేతలు ప్రచారం సాగించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం నెలకొందని, నెల్లూరు అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ పాలనలో ఎన్నికల సమయంలో వివాదాలు, విమర్శలు ఉండేవని వారు విమర్శించారు. నగరంలో రోడ్లు, డ్రైనేజీలు తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని, ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. రోడ్‌షోలు, ఇంటింటి ప్రచారాలకు ప్రజల నుంచి స్పందన లభిస్తోందని పేర్కొంటూ, మేయర్ స్థానంతో పాటు అన్ని డివిజన్లలో కూటమి అభ్యర్థులు విజయం సాధిస్తారనే ధీమా వ్యక్తం చేశారు. మిత్రపక్షాల అభ్యర్థుల విజయానికి మంత్రి నారాయణ స్వయంగా ప్రచారంలో పాల్గొనడం నెల్లూరు నగర ఎన్నికల్లో రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది.

## స్థానిక ఎన్నికల్లో పక్షపాత వైఖరి దుర్మార్గం



**నెల్లూరు,(అక్షర దర్శిని) :** స్థానిక సంస్థల ఎన్నికల్లో చోటుచేసుకున్న దాడులు, దౌర్జన్యాలు, బెదిరింపులపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) సమగ్ర విచారణ జరిపించాలని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల అక్రమాలకు సంబంధించి ఇప్పటికే ఎస్ఈసీకి ఆధారాలు సమర్పించామని, వాటిపై విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రభుత్వ ఒత్తిడికి లోబడి పనిచేస్తోందని ఆరోపించారు. రానున్న పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియనైనా నిష్పాక్షికంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల అక్రమాలకు పాల్పడిన అధికారులు, నాయకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసిన కాకాణి, ప్రజాస్వామ్య హక్కులను హరించే ప్రయత్నాలను వైఎస్సార్‌సీపీ సహించబోదన్నారు. అవసరమైతే న్యాయస్థానాలను ఆశ్రయించి న్యాయపోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల విధుల్లో అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు.

## ప్రచారంలో కూటమి జెట్ స్పీడ్!

▸▸ గడువు మూడు రోజులే.. గెలుపే లక్ష్యంగా రమాదేవి రోడ్‌షోలు

▸▸ 11, 12, 14, 18వ డివిజన్లలో విస్తృత ప్రచారం

▸▸ ఐరన్ బండి వద్ద ఆప్యాయ పలకరింపు.. స్వయంగా బట్టలు ఇస్త్రీ చేసి సందడి

**నెల్లూరు,(అక్షర దర్శిని):** నెల్లూరు నగరపాలక సంస్థ ఎన్నికల ప్రచారానికి గడువు సమీపిస్తుండటంతో కూటమి నేతలు ప్రచార వేగాన్ని పెంచారు. అభ్యర్థుల విజయమే లక్ష్యంగా మంత్రి పొంగూరు నారాయణ కుటుంబ సభ్యులు విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా మంత్రి సతీమణి పొంగూరు రమాదేవి మంగళవారం నగరంలోని 11, 12, 14, 18వ డివిజన్లలో రోడ్‌షోలు, ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో అభ్యర్థులు, కార్యకర్తలు ఆమెకు ఘనస్వాగతం పలికారు.

స్థానికులతో మమేకమవుతూ, నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరిస్తూ రమాదేవి ఓటర్ల మద్దతు కోరారు. మేయర్ అభ్యర్థి రూప్‌కుమార్ యాదవ్‌తో పాటు సంబంధిత డివిజన్లలోని కూటమి అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

**అభివృద్ధే ప్రధాన అజెండా** నగరాభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా మంత్రి నారాయణ పనిచేస్తున్నారని రమాదేవి పేర్కొన్నారు. నవాపేటలో రూ.60 కోట్లతో 22 ఎకరాల్లో మోడల్ మార్కెట్ ఏర్పాటు, అల్లిపురం డంపింగ్ యార్డులో 80 వేల టన్నుల చెత్త తొలగింపు, అక్కడ 6.75 ఎకరాల్లో అడ్వెంచర్ పార్కు ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు. పేదల శుభకార్యాల కోసం కమ్యూనిటీ హాళ్లను అందుబాటులోకి తెస్తున్నామని తెలిపారు. నారాయణ ఆన్ వీల్స్, నారాయణ నేత్రజ్యోతి, దంత సురక్ష కార్యక్రమాల ద్వారా పేదలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. అవసరమైన వారికి కంటి అద్దాలు, శస్త్రచికిత్సలు ఉచితంగా కల్పిస్తున్నామని, గ్రీన్ నెల్లూరు లక్ష్యంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నామని వివరించారు. నగరాభివృద్ధికి ప్రజలు సహకరించి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

**ఐరన్ బండి వద్ద ఆప్యాయ పలకరింపు** ప్రచారంలో భాగంగా రమాదేవి స్థానికంగా ఉన్న ఇస్త్రీ బండి వద్ద ఆగి నిర్వాహకుడి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్వయంగా బట్టలు ఇస్త్రీ చేయడంతో అక్కడున్న వారు ఆసక్తిగా తిలకించారు. సామాన్యులతో కలిసిపోతూ ఆమె సాగించిన ప్రచారం స్థానికుల దృష్టిని ఆకర్షించింది. ఎన్నికల ప్రచారానికి గడువు సమీపిస్తుండటంతో కూటమి నాయకులు, కార్యకర్తలు అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేశారు.



Publisher, Editor & Owned by: KADIYALA CHINMAYA REDDY, Thatiparthi Village, Podalakur Mandal, Sri Potti Sreeramulu Nellore, Andhra Pradesh 524309. Printed by: VIJAYA GRAPHICS, D.No. 26-3-1993. Chandramouli Nagar, 1st Steet Veda Yapalem, Sri Potti Sreeramulu Nellore, Andhra Pradesh 524004.